జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి నాయకత్వంలో పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

టిడిపిలోకి బైరెడ్డి..?

- బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి నంద్యాల ఎంపీ టికెట్ ఖరారు..?
- మరో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు
- నందికొట్కూరు, పాణ్యంపై గురి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి టిడిపి గూటికి చేరనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. బైరెడ్డి సొంత గూటికి చేరేందుకు లైన్ క్లియర్ అయింది. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టు కావడంతో చేరికకు బ్రేక్ పడింది. తండ్రి వెంటే వారసురాలు బైరెడ్డి శబరి కూడా పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం...

మాజీ ఎమ్మెల్యే రాజశేఖర రెడ్డి నందికొట్కూరు సెగ్మెంట్ లో 1994, 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రజా సేవలో తనకంటూ సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు. 2004లో ప్రత్యర్థి గౌరు చరితా రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో నందికొట్కూరు ఎస్సీ రిజర్వుడు అయింది. దీంతో బైరెడ్డి, గౌరు చరిత రెడ్డిలు పాణ్యంలో పోటీ పడ్డారు. కొన్ని అనివార్య కారణాల వల్ల 2012లో టిడిపిని వీడి ప్రత్యేక రాయలసీమ గళం అందుకున్నారు. ఆ సమయంలోనే రాయలసీమ పరిరక్షణ సమితిని స్థాపించారు. రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించి ప్రత్యేక రాయలసీమ కోసం కృషి చేశారు. అందుకోసం ఆయన రాయలసీమ వాసులను చైతన్యం చేసేందుకు రాయలసీమ జిల్లాల్లో పర్యటించారు. కానీ ఆశించిన స్థాయిలో ప్రజాదారణ లేకపోవడంతో 2018లో కాంగ్రెస్ లో చేరారు. అప్పటికే రాష్ట్ర విభజనకు ప్రధాన కారణం కాంగ్రెస్ కావడంతో కాంగ్రెస్ కు కనీసం లీడర్లు కూడా లేకుండా పోయారు. దీంతో ఆయన తిరిగి 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. మిత్ర శత్రువులైన బైరెడ్డి, గౌరు వెంకటరెడ్డిలు పార్టీ కోసం కలిసి పని చేశారు. ఆ తర్వాత తన కుమార్తె డాక్టర్ బైరెడ్డి శబరితో పాటు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. గత కొంత కాలంగా రాయలసీమ వెనుకబాటు తనంపై గళమెత్తుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ తీరును ఎండగడుతూ రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాలు చేపట్టాలని కోరుతూ అనేక ఉద్యమాలు చేశారు. ఏపీ-తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన సిద్దేశ్వరం-సోమశిల ప్రాంతాల వద్ద కేంద్రం ప్రపంచంలోనే రెండోదైన తీగల వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ వంతెనను వ్యతిరేకిస్తూ వంతెనకు బదులు బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మిస్తే సీమ సస్యశ్యామలం అవుతుందని వాదిస్తూ వస్తున్నారు. తద్వారా 70 నుంచి 80 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని సీమ వాసులను చైతన్యం చేస్తూ ప్రభుత్వాలను హెచ్చరించారు. అందుకోసం రాయలసీమ నుంచి ప్రత్యేక ట్రైన్ ద్వారా దాదాపు 3 వేల మందితో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి సక్సెస్ అయ్యారు.

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డికి టీడీపీ అధిష్టానం నంద్యాల ఎంపీ టికెట్ కేటాయించినట్లు సమాచారం. ఎస్సీ నియోజకవర్గమైన నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాలు కూడా తమఅనుచరులకు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అధిష్టానం అందులో ఒక నియోజక వర్గాన్ని అప్పగించేందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఇటీవల బైరెడ్డి నందికొట్కూరులోని ఆయన నివాసంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమై పార్టీలో చేరికపై చర్చించారు. టిడిపిలో చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో అందరూ సిద్ధంగా ఉండాలని తన అనుచరులకు సూచించారు. ఆయన అనుచరులు కూడా టీడీపీలో చేరితేనే మరింత బలపడతామనే అభిప్రాయాలను చెప్పారు. మొదట ఎమ్మెల్యే టికెట్లు ఆశించినా అధిష్టానం మాత్రం ఆయన జిల్లాను లీడ్ చేయగలరనే ఉద్దేశంతో పార్లమెంట్ స్థానాన్ని అప్పగించింది. ఆయన కూడా ఎంపీగా అయితే 7 నియోజకవర్గాలపై పట్టు సాధించే అవకాశం ఉందని ఎంపీకే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. పాణ్యం టికెట్ అప్పగిస్తే ఆయన కుమార్తె, ప్రస్తుత బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరిని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టాలనుకుంటున్నారు.. అక్కడ ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి టీడీపీ ఇంచార్జిగా ఉన్నారు. ఆమెకు ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశాలున్నాయని సమాచారం. పాణ్యం కాకుండా నందికొట్కూరు కేటాయిస్తే మాత్రం బైరెడ్డి సూచించిన వారికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వనున్నారు. బైరెడ్డి రాకతో టిడిపి మరింత బలపడుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

49వ వార్డులో పనులపై

విజిలెన్స్ విచారణ చేపట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని 49వ వార్డు పరిధిలో జరుగుతున్న పనులపై విజిలెన్స్ విచారణ జరిపించాలని సిపిఎం జిల్లాకార్యదర్శి గౌస్ దేశాయి, నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్ డిమాండ్ చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 49వ వార్డు కార్పొరేటర్ కృష్ణ కాంత్ తన పలుకుబడిని ఉపయోగించి బాగున్న సిసి రోడ్లపై మళ్లీ సిసిరోడ్డు వేసి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. 49వ వార్డులో పనులను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి ఆసక్తికరమైన సంఘటనలు బయటపడ్డాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 48వ వార్డు, 49వ వార్డుకు మధ్యలో మెయిన్‌రోడ్డు నుంచి రోజా దర్గాకు వెళ్లే రోడ్డు(రాధాకృష్ణ హాస్పిటల్ ఎదురుగా)చాలా బాగా ఉన్నప్పటికీ అదే రోడ్డుపై రోడ్డు వేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాధనాన్ని ఏవిధంగా లూటీ చేయాలో 49వ వార్డు కార్పొరేటర్ కృష్ణకాంత్‌కు బాగా తెలుసునని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్లు ఏ విధంగా రోడ్లు వేయడానికి అనుమతించారని, ఏ విధంగా నిధులు మంజూరు చేశారని ప్రశ్నించారు. ఒక సీసీ రోడ్‌కాల పరిమితి కనీసం 30 సంవత్సరాలు పైబడి ఉంటుందని,ఈ విషయాన్ని వారికి తెలియదాఆని వారిని ప్రశ్నించారు. ఇలా రోడ్డు బాగున్న రోడ్డుపై మళ్లీ రోడ్డు వేయడానికి ఎంత లంచం తీసుకున్నారని ప్రశ్నించారు. నగరంలో చాలా కాలనీల్లో రోడ్డు లేక డ్రైనేజ్ కాలువ లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే అలాంటి చోట్ల రోడ్లు వేయకుండా రోడ్డు బాగున్నచోటే డబ్బులకు కక్కుర్తి పడి అనుమతులు ఇవ్వడం అంటేనే అధికారులు ఎలాంటి అవినీతికి పాల్పడుతున్నారో చాలా స్పష్టంగా అర్థం అవుతుందని ఘాటుగా విమర్శించారు. మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న 49 వ వార్డు రోజా, ప్రకాష్ నగర్‌లో రోడ్లు వేస్తుంటే కనబడడం లేదా అని వారు ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయానికి దగ్గరలో పనులు జరుగుతున్నా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టినట్టు వ్యవహరించటం సరైన పద్ధతి కాదన్నారు. ఎఇ, డిఇలు కమిషన్లకు కక్కుర్తి పడి పనులను పర్యవేక్షించకుండా గాలికి వదిలేసారని విమర్శించారు. తక్షణమే పనుల అనుమతులపై విజిలెన్స్ విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిచో ప్రజానీకాన్ని కదిలించి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నగర నాయకులు అబ్దుల్ దేశాయ్, రామకృష్ణ, షరీఫ్, నగర కమిటీ సభ్యులు మాబాష తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

- యుటిఎఫ్ రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావాల్సిన రూ.18 వేల కోట్ల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను కర్నూలు నగరంలో ధర్నా చౌక్‌లో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ ప్రారంభించారు. కర్నూలు జిల్లా అధ్యక్షులు రవికుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన దీక్షలనుద్దేశించి కె. సురేష్ కుమార్ మాట్లాడారు. ఉద్యోగుల లోన్స్ విడుదల చేయాలని, పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని ఈ దీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ దీక్షలు నాలుగు రోజులపాటు కొనసాగుతాయన్నారు. ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల పిఎఫ్ ,ఎపిజిఎల్ఐసి,ఇఎల్ఎస్, లోన్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఆర్‌సి, ఐఆర్ 30శాతం చెల్లించాలని కోరారు. ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న అప్రెంటిషిప్ విధానం రద్దు ను ఈ ప్రభుత్వం ప్రస్తుత డిఎస్‌సిలో పునరుద్ధరించడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగులకు మంచి చేయలేదు సరి కదా కీడు చేసే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ , కోశాధికారి యెహోషువ, గౌరవాధ్యక్షుడు దావీదు, నాగమణి, ఎల్లప్ప, జయరాజు, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న ,నరసింహులు , నిరాహార దీక్షలో జిల్లా కార్యదర్శి దుర్గా, నాగరాజు సుధాకర్, రాజు, భాస్కర్, యు. రాజు మొదలగువారు ఉన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు నాగమణి

వాహన చట్టాలపై

అవగాహన అవసరం

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రోడ్ల పైన వాహనాలు నడిపేవారు వాహన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా కలెక్టరేట్ నుండి సి.క్యాంపు సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల పైన వాహనాలు నడిపేవారు వాహన చట్టాలపై ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రోడ్ల పైన వాహన ప్రమాదాలను నివారించుట కొరకే రాష్ట్రప్రభుత్వం జనవరి 20 నుండి ఫిబ్రవరి 19 వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా బుధవారం వాహన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి కలెక్టరేట్ నుండి సి క్యాంపు వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. రోడ్లపై వాహనాలు నడిపే వారిలో ఎక్కువ శాతం యువతకే ఫైన్ లు పడుతున్నాయి అని అన్నారు. డ్రైవింగ్ పై మక్కువ ఉండవచ్చును కాని డ్రైవింగ్ చేసేటప్పుడు ఖచ్చితంగా వాహన చట్టాలను పాటించాలన్నారు. యువత 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే డ్రైవింగ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుందన్నారు. కొంతమంది యువత 18 సంవత్సరాలు నిండకముందే బైకులో రోడ్ల పైన విన్యాసాలు చేస్తూ వారు ఇబ్బంది పడడమే కాకుండా ఇతరులకు కూడా ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. డిటిసి శ్రీధర్ మాట్లాడుతూ ముందుగా మాసోత్సవాల షెడ్యూల్‌ను వివరించారు. వాహన చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల ఎంతోమంది కుటుంబ యజమానులు, యువకులు అర్థాంతరంగా మరణిస్తుండటం వల్ల ఆయా కుటుంబాలు రోడ్డున పడటమే కాకుండా, వారికి తీరని శోకాన్ని మిగిలిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిఒ రమేష్, ట్రాఫిక్ డిఎస్‌సి నాగభూషణం, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ,డ్రైవింగ్ స్కూల్స్ , ఆటో రిక్షా, టాక్సీ , ప్రైవేటు బస్సుల, లారీల డ్రైవర్లు, వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జి.పుల్లయ్య ఇతర నాయకులు

ఆనందాల వేడుక బాలోత్సవం

- ప్రముఖ విద్యావేత్త జి.పుల్లయ్య
- బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతిఏటా నిర్వహించే పిల్లలపండుగ బాలోత్సవమని, ఆనందాల వేడుకగా సాగుతుందని ప్రముఖ విద్యావేత్త రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. బుధవారం సాయంత్రం రవీంద్ర పాఠశాలలో బాలోత్సవం బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. బాలోత్సవాలు ఇండస్ మాంటిస్సోరి వేదికగా ఈనెల 8, 9 తేదీలలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు. బ్రోచర్ ఆవిష్కరణలో ప్రవేటు విద్యాసంస్థల జిల్లా అధ్యక్షులు బి.వాసుదేవయ్య సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, బాలోత్సవ కన్వీనర్ జెఎన్. శేషయ్య, బాలోత్సవ నిర్వహణ ఆర్గనైజర్లు రంగస్వామి, ఎంపి బసవరాజు, అబ్దుల్లా, నవీన్ పాటి, రవికుమార్, హేమంత్, యెహోషువా, డి.ఈశ్వరయ్య, నరసింహా, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పోలీసు డైరీని ఆవిష్కరించిన ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు పోలీసు డైరీ-2024ను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి జి.కృష్ణకాంత్ ఆవిష్కరించారు. పోలీసులకు సంబంధించి సమగ్ర సమాచారం కలిగి ఉన్న ఈ పోలీసు డైరీ రోజువారీ దైనందిన కార్యకలాపాలలో పోలీసు సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోలీసు డైరీ-2024 తయారీకి కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. జిల్లా పోలీసుల సంక్షేమానికి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామని, అన్ని చర్యలు తీసుకుంటామని ఈ సంధర్బంగా ఎస్పి తెలిపారు. పోలీసు డైరీలో ఉన్న సమాచారం మేరకు తమ నియమావళిని తెలుసుకుని సిబ్బంది అందరూ సక్రమముగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాకు, పోలీసు శాఖకు మంచి పేరు తేవాలన్నారు. అడిషనల్ ఎస్పి అడ్మిన్ నాగరాజు, స్పెషల్ బ్రాంచి సిఐలు నాగరాజు యాదవ్, శ్రీనివాస రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, కార్యనిర్వహక సభ్యుడు ఖాజా బంద, పోలీసు హౌసింగ్ సొసైటి అధ్యక్షులు రఘురాముడు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

ఐదు బైకులు స్వాధీనం, పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఇందితులు, బైక్‌లతో సిఐ శంకరయ్య బృందం

వరుసగా ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ పి.శంకరయ్య తెలిపారు. బుధవారం ఆయన స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను, ఎస్‌పి.మోహన్ కిషోర్ రెడ్డి , సిబ్బందితో కలసి కర్నూలులోని సంతోష్ నగర్ ఆర్చ్ దగ్గర జనవరి30న సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా కడప జిల్లా పొద్దుటూరు మండలానికి చెందిన బద్రి అలియాస్ మహేష్, రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం, లక్ష్మీదేవుని పల్లికి చెందిన కావలి నరసింహులు హైదరాబాద్ వైపు నుండి మోటార్ సైకిల్‌ను వేసుకొని వస్తున్నారు. పోలీస్‌లను చూసిపారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వారిని అదుపులోకి తీసుకొని వారి నుండి 5 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని విచారించమన్నారు. ఇందులో 4 మోటార్ సైకిళ్లను 4 వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోనివి కాగా, ఒక మోటార్ సైకిల్ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోనిదన్నారు. ఈ 5 మోటార్ సైకిళ్ల మొత్తం విలువ రూ.5,07,000 ఉంటుంది.

ఘనంగా ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ జన్మదిన వేడుకలు

పలుచోట్ల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు ,కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా పలుచోట్ల కేక్ కటింగ్‌లు అన్నదాన సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కర్నూలు గోరక్షణ మహా సంఘం ఆధ్వర్యంలో ఈరోజు గోశాల నందు గోశాల కమిటీ సభ్యులు గోపూజ చేసి కర్నూలు ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్ పేరు మీద అర్చన చేయించి కేక్ కట్ చేశారు. గోరక్షణ మహా సంఘం చైర్మన్ ఆది మోహన్ రెడ్డి, వైఎస్ఆర్ సేవా దళ్ జిల్లా అధ్యక్షులు కేదార్ నాథ్, మాజీ మేయర్ బంగిఅనంతయ్య, ట్రస్టీ మెంబర్స్ భాస్కర్ రెడ్డి, శేషయ్య, జోహర్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కర్నూలు 23వ వార్డు నాయకులు, సుచిత వార్డు నాయకులు కార్యకర్తలు అభయగిరి చర్చిలో ప్రార్థనలు చేసి అనాధలతో కేక్ కట్ చేయించి అన్నదానం చేశారు. పార్టీ క్లస్టర్ 2 అధ్యక్షులు కేదార్ నాథ్, వార్డు ఇంచార్జ్ ఏసన్న, సంతోష్ కిరణ్, మజీద్ ఖాన్, కృష్ణ కాంత్ శర్మ, కృపాదానం, గిరిధర్, బలరాం, హనీఫ్, నరేష్, అరుణ్, వినోద్, జగన్, సుభాన్ పాల్గొన్నారు.

గజమాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

గజమాలతో జన్మదిన శుభాకాంక్షలు

ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కర్నూలు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా మళ్లీ హాఫీజ్ ఖాన్ రావాలని వైసిపి నాయకులు అక్బర్ అన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ జన్మదిన సందర్భంగా హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ కర్నూల్ నియోజకవర్గం ప్రజల కోసం అందిస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజల కోసం ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు, నిత్యవసర సరుకులు అందించారని అన్నారు. జోరాపురం బ్రిడ్జ్, ఆనంద్ టాకీస్ బ్రిడ్జ్, బిర్లా గేట్ బ్రిడ్జ్, పార్కులు అభివృద్ధి, సుందరీకరణ, కులమతాలకు అతీతంగా స్మశాన వాటికలు అభివృద్ధి, దేవాలయాల అభివృద్ధి కొరకు నిధులు తెచ్చారన్నారు. మళ్లీ కర్నూలు ఎమ్మెల్యేగా హాఫీజ్ ఖాన్‌ను గెలిపించుకోవాలని అన్నారు. వైసిపి నాయకులు అక్బర్ అలీ, జమ్మన్న, చందు, సూర్యమోహన్, నాగేంద్ర, సోషల్ మీడియా మన్సూర్, ఖయ్యుమ్, ఫరాజ్ ఖాన్ పాల్గొన్నారు.

సర్వీసుల క్రమబద్ధీకరణకు ఆర్ఎం వెంకటరామం కృషి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ కర్నూలు ప్రజా రవాణా అధికారి టేకి వెంకటరామం బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన 2020 జనవరి 7న కర్నూలు ఆర్ఎంగా బాధ్యలు చేపట్టారు. సర్వీసులు క్రమబద్ధీకరించుటలో ఆయన ఎంతో కృచేశారు. ఉద్యోగ విరమణ సభలో ఆర్‌టిసి అధికారులు, ఉద్యోగులు, టేకి వెంకటరామం సేవలను కొనియాడారు. ప్రధానంగా సర్వీసుల క్రమబద్ధీకరణలో ఆయన కృషి అభినందనీయమని అన్నారు. ఎఒ సుధాకర్, వన్ అండ్ టు డిపోల మేనేజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎం టేకి వెంకటరామం ఉద్యోగ విరమణసభలో మాట్లాడుతున్న ఎఒ సుధాకర్

16న రవాణా రంగ బంద్‌ను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న పిఎస్. రాధాకృష్ణ

వివిధ రంగాల డ్రైవర్లను జైలు శిక్షలు, భారీ జరిమానాలు అమలు చేసే భారత న్యాయ సంహిత 2023 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదం పొంది 106 (1)-(2) చట్టాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం తక్షణమే చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్తంగా జరిగే రవాణా రంగ సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రవాణా రంగ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయంలో ట్రాన్స్‌పోర్టు రంగ జిల్లా బాధ్యుల సమావేశం నాయకులు గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ భారత శిక్షా స్మృతి 1980 చట్టం ప్రకారం డ్రైవర్ తప్పిదం చేస్తే సెక్షన్ 304 ఎ ప్రకారం రూ.1500 జరిమాన రెండు సంవత్సరాలు జైలు శిక్షలు విధించేవారన్నారు. ఈ శిక్షలు సరిపోవు అన్నట్లు ఇప్పుడు కొత్త చట్టాలను తీసుకొచ్చి డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించడం సరైన పద్ధతి కాదన్నారు. కొత్త చట్టం రద్దుకోసం ఈనెల 3 నుంచి డ్రైవర్లతో సంతకాల సేకరణ, 10న జిల్లా సదస్సు , 13న రవాణా రంగ జిల్లా జాతా, 16న ఒకరోజు సమ్మె చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదానికి ఆటో ,లారీ ,ఎయిర్బస్, స్కూల్ బస్, మినీ లారీ డ్రైవర్ల అందరూ పాల్గొనాలని కోరారు. ఎయిర్బస్ వర్కర్స్ యూనియన్ శ్రీను, స్కూల్ బస్సు వర్కర్స్ యూనియన్ నాయకులు సిద్దయ్య, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు రఘు, వలిబాష, మల్లికార్జున రెడ్డి ,సుధాకర్‌పాల్గొన్నారు.

డిఇఒను సన్మానిస్తున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు, ఆఫీస్ సిబ్బంది

డిఇఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వెంకట రంగారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు సన్మానించాయి. బుధవారం నగర శివారులలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్‌పాల్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిఇఒ రంగారెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో విద్యారంగా అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నామన్నారు. పశ్చిమ ప్రాంతంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. ఉపాధ్యాయులుకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. ఎంతో సంతృప్తిగా పనిచేసి ఉద్యోగ విరమణ చెందానన్నారు. కర్నూలు జిల్లా ఉపాధ్యాయులు తన విధినిర్వహణకు అన్ని విధాల సహకరించారని అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ,డిప్యూటీ డిఇఒ హనుమంతరావు, మండల విద్యాశాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డిఇఒగా ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి ఉద్యోగ విరమణ చెందడంతో ఆయన స్థానంలో కడప ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డికి అదనపు బాధ్యతలను అప్పగించినట్లు తెలిసింది. అయితే ఇక్కడికి జిల్లా విద్యాశాఖ అధికారి కొత్త అధికారి వచ్చేంతవరకు ఆయన ఇన్చార్జిగా వ్యవహరిస్తారని తెలిసింది.

జిల్లాలో తహశీల్దార్ల బదిలీలు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని తహశీల్దారులను అంతర్ జిల్లాలకు బదిలీలు చేస్తూ సిసిఎల్ఎ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్నటువంటి తహసీల్దార్లను కడప,చిత్తూరు జిల్లాలకు బదిలీ చేశారు. అయితే కర్నూలు జిల్లాకు అనంతపురం జిల్లా నుండి 16 మందిని, కడప జిల్లా నుండి 11 మంది తహశీల్దారులను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంత పెత్తమొత్తంలో తహశీల్దార్లను బదిలీ చేయడం ఇదే తొలిసారి.

వేరుశనగ టెండర్ ఫారం వచ్చిన తర్వాత గ్రేడింగ్ చేయడం ఆపాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ టెండర్ ఫారం వచ్చిన తర్వాత వ్యాపారులు గ్రేడింగ్ చేయించి తూకాలు వేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ పద్ధతిని నిలిపివేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీలోని సిబ్బందికి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్లలో లేని పద్ధతి ఆదోనిలో ఉందని, వ్యాపారులు రైతులను తీవ్రంగా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యపై గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నేటికీ అలాగే కొనసాగుతోందని, ఈ పద్ధతిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.శేఖర్, అయ్యప్ప, రైతుసంఘం మండల నాయకులు హనుమంతు రెడ్డి, అబ్బాస్, లక్ష్మన్న పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

- వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి

స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి తాలూకాలో అధ్వానంగా ఉన్న ప్రతి రోడ్డు నిర్మాణాన్ని చేపడతానని వైసిపి ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి తెలిపారు. బుధవారం హోళగుందలో వైసిపి నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్య కూడా ఉందని, తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనపై నమ్మకం పెట్టి ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చారని, తాను ప్రజల మనిషిని అని చెప్పారు. 2024 ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజలకు సేవ చేసుకుంటానని తెలిపారు.

జన ఔషధ కేంద్రాన్ని వినియోగించుకోండి

- సహకార సంఘం అధ్యక్షులు దాట్ల కృష్ణంరాజు

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణంరాజు

ప్రజాశక్తి - కౌతాళం

భారత జన ఔషధ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షులు దాట్ల కృష్ణంరాజు కోరారు. బుధవారం సహకార సంఘం కార్యాలయంలో ఔషధ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆరోగ్యరీత్యా ప్రజల ఖర్చులు పెరిగిపోతున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన ఔషధాలు తక్కువ ధరకు ప్రజలకు అందించాలని ఉద్దేశంతో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి ప్రపంచంలో ఎన్నో కంపెనీలు పోటీ పడుతూ తమ తమ లాభసాటిగా మందులను మార్కెట్లో విక్రయిస్తున్నాయని చెప్పారు. జన ఔషధ కేంద్రం ద్వారా అవే మందులు తక్కువ ధరకు ప్రజలకు అందిస్తుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ నాగరాజు గౌడ్, సహకార సంఘం మాజీ అధ్యక్షులు వీరసేనారెడ్డి, మండల ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి, నాయకులు ఏకం రెడ్డి, భీమన్న గౌడ్, సుధాకర్ రెడ్డి, నర్సారెడ్డి, సోమిరెడ్డి, సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, కెడిసిసి బ్యాంకు మేనేజర్ మహబూబ్ బాషా, సూపర్‌వైజర్ విజయ భాస్కర్, ఫార్మాసిస్ట్ జిక్రియా, సిఇఒ వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కిరాణ షాపు దగ్ధం

- రూ.5 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని హాలిగేర గ్రామంలో మంగళవారం రాత్రి 1.30 గంటల సమయంలో హరిజన రోశమ్మ కిరాణ షాపు విద్యుదాఘాతంతో పూర్తిగా దగ్ధమైంది. రూ.లక్ష నగదుతో పాటు దాదాపు రూ.4 లక్షల సరుకు నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. రాత్రి గ్రామస్తులు పత్తికొండ అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి విషయం తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చే సరికే షాపు మంటల్లో కాలి బూడిదయింది. బుధవారం ఉదయం పంచాయతీ సెక్రటరీ చిన్న వెంకటేశ్వర్లు, విఆర్ఒ రాజేశ్వరి పరిశీలించి తహశీల్దార్‌కు నివేదిక అందజేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచి లింగమ్మ, గ్రామస్తులు కోరారు.

రెండో రోజూ ఎసిబి విచారణ

- **విఆర్ఒ రామకృష్ణ, విఆర్ఎ మల్లేష్ ఎసిబి కోర్టులో హాజరు**
- **వచ్చే నెల 13 వరకు రిమాండ్ విధించిన కోర్టు**

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో రైతుల నుంచి లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడిన విఆర్ఒ రామకృష్ణ, విఆర్ఎ తలారి మల్లేష్‌పై రెండోరోజూ విచారణ చేపట్టారు. ఎసిబి అధికారులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు హెచ్.కైరవాడి గ్రామంలోని సచివాలయంలో విచారించారు. గ్రామంలో రైతులను సచివాలయం దగ్గరకు పిలిపించి ఎసిబి అధికారులు విచారణ చేశారు.

దాడులతో ఉలిక్కిపడిన గోనెగండ్ల

మండలంలో చాలా రోజుల తర్వాత ఎసిబి అధికారులు దాడి చేయడంతో మండలంలోని అన్ని శాఖల అధికారులు ఉలిక్కి పడ్డారు. రైతుల నుంచి లంచం తీసుకుంటున్న విఆర్ఒ, విఆర్ఎలను ఎసిబి చాకచక్యంగా వలపన్ని పట్టుకోవడంతో గోనెగండ్లతో పాటు మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు.

హెచ్.కైరవాడి సచివాలయం వద్ద గుమిగూడిన గ్రామస్తులు

2002లో అప్పటి తహశీల్దార్ విక్రమ్ రెడ్డి కూడా ఎసిబి వలకు దొరికిపోయారు. తర్వాత 2007, 2008లో కూడా విఆర్ఒ స్వామి, ఆర్ఐ ఈరన్న ఎసిబి అధికారులకు దొరికిపోయారు. ప్రస్తుతం హెచ్.కైరవాడి గ్రామంలో విఆర్ఒ రామకృష్ణ, విఆర్ఎ మల్లేష్ ఎసిబి వలకు దొరికిపోయారు.

నిందితులు ఎసిబి కోర్టులో హాజరు

- రిమాండ్ విధించిన కోర్టు

నిందితులైన విఆర్ఒ రామకృష్ణ, విఆర్ఎ మల్లేష్‌ను బుధవారం మధ్యాహ్నం కర్నూలులోని ఎసిబి కోర్టులో హాజరు పరిచామని ఎసిబి డీఎస్పీ వెంకటాద్రి, సిఐ తేజేశ్వరరావు తెలిపారు. కోర్టు ఇద్దరికీ వచ్చే నెల 13 వరకు రిమాండ్‌కు ఆదేశించిందని చెప్పారు. అనంతరం వారిని కర్నూలు జిల్లా జైలుకు రిమాండ్‌కు పంపినట్లు వారు తెలిపారు.

బీవీ గెలుపే లక్ష్యం

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - నందవరం

రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా బీవీ.జయనాగేశ్వర రెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని, బీవీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేస్తారని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీ కాసీం వలీ, మండల కన్వీనర్ చిన్న రాముడు తెలిపారు. బుధవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో నాయకులు, కార్యకర్తలు కలిసి ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మిగనూరు అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి అని, ఆయన కుమారుడు బీవీ.జయనాగేశ్వరరెడ్డిని ఓడించే దమ్ము ఏ పార్టీ నాయకులకు లేదని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీవీ భారీ మెజార్టీతో గెలవబోతున్నారని జోష్యం చెప్పారు. ఐటిడిపి నాయకులు వీరేష్, డబ్బా ఈరన్న, మిట్టసోమాపురం వీరేష్, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, సోమన్న, ఆదిశేషు, మహబూబ్ బాష, మల్లి, దస్తగిరి, ఉరుకుంద, మహేష్ పాల్గొన్నారు.

నాగలదిన్నెలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

మేమే అధికారంలోకి వస్తాం...

- **ముస్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ - కౌన్సిల్‌లో రాజకీయాలు మాట్లాడటం సిగ్గు చేటు**
- **టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్ - టిడిపి కౌన్సిలర్ దయాసాగర్, వైస్ ఛైర్మన్ నజీర్ మధ్య వాగ్వాదం**

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో తిరిగి తామే అధికారంలోకి వస్తామని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ తెలిపారు. అభ్యంతరం వ్యక్తం చేసిన టిడిపి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ ప్రజల సమస్యలపై మాట్లాడాల్సిన కౌన్సిల్ సమావేశంలో రాజకీయాలు మాట్లాడడం సిగ్గు చేటని విమర్శించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాలులో ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమావేశం ప్రారంభమైన కొద్ది నిమిషాలకే ఛైర్మన్ డాక్టర్ రఘు బెల్ కొట్టి సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి బయటికి వెళ్లారు. అంతకముందు నజీర్ అహ్మద్ మాట్లాడుతూ... పట్టణంలో ప్రధాన రోడ్లు వేస్తున్నా కమిషనర్‌పై ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే బీవీ.జయానాగేశ్వర రెడ్డికి తగదని అన్నారు. ఇందుకు స్పందించిన టిడిపి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, రామదాసు గౌడ్ మాట్లాడుతూ... పట్టణంలో వేసిన రోడ్లపై బిటి రోడ్లు వేస్తున్నారని, వీటిని గత 20 రోజుల క్రితం ప్యాచ్ వర్క్ చేశారని తెలిపారు. రోడ్లు వేసేటప్పుడు ప్యాచ్ వర్క్ ఎందుకు చేశారని ప్రశ్నించారు. దీని వల్ల ప్రజాధనం వృథా అయిందని, టిడిపి హయాంలో వార్డుల్లో తాగునీటి అవసరాలకు నిర్మించిన ట్యాంకులను అధికార పార్టీ వారు పగులగొట్టారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వార్డు ప్రజలు ఫిర్యాదు చేశారని, ఇంతవరకు వారిపై చర్యలు లేవని చెప్పారు. కాంట్రాక్టర్లకు రూ.3 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఎంబి చర్చి నుంచి కబరస్తాన్ కొట్టాల వరకు రోడ్డు వేయాలని కోరారు. ఇందుకు మరోసారి తామే అధికారంలోకి వస్తామని నజీర్ చెప్పడంతో టిడిపి సభ్యులు కార్యాలయం ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. వైస్ ఛైర్మన్ కదిరికోట దివ్యకళ, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డిఇ మనోహర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ అధికారి మురళీ కృష్ణ, కౌన్సిలర్లు బోయ బజారి, నాగేషప్ప, వహీద్, ఇసాక్, అమాన్ పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

బైఠాయించిన టిడిపి కౌన్సిలర్లు

విద్యార్థినిని సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు బందేనవాజ్, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు అక్బర్ బాష తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. గతంలో రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ముంబయి వారు నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ఆ సంస్థ నుంచి 10 గోల్డ్ మెడల్స్, 10 సిల్వర్ మెడల్స్, ఒక మెమెంటో వచ్చినట్లు చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయుల చేత మెమొంటోలు, మెడల్స్ పంపిణీ చేశామన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ బాష, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కౌతాళం

కర్నూలు నగరంలోని ఓమ్ని హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య బుధవారం కోరారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి కర్నూలు నగరం నుంచి వైద్యులు వస్తున్నారన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువతి మృతి

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన సుస్మిత (19) బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుస్మిత సోమవారం పూజ కోసం నీరు పెట్టేందుకు వెళ్లారని తెలిపారు. తిరిగి రాకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. సుస్మిత బుధవారం బావిలో మృతదేహం కనిపించారని తెలిపారు. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డారని, తల్లి మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర పేర్కొన్నారు.

అంధ విద్యార్థికి ఎస్‌ఎఫ్‌ఐ సాయం

ప్రజాశక్తి - ఆదోని

అంధ విద్యార్థికి సహాయం చేసి సామాజిక సేవలోనూ ఎస్ఎఫ్ఐ ముందంజలో ఉంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆదోనిలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 31 నుంచి జిల్లావ్యాప్తంగా జరుగుతున్న పిజి పరీక్షల్లో అంధ విద్యార్థికి తోడుగా తాము ఉన్నామంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు పరీక్షను రాసి ఔదార్యం చాటుకున్నారన్నారు. చదువు, పోరాటం మాత్రమే కాదని, సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

నీతోనే నాకు పోటీ మీనాక్షీ...

- **నాకు వైసిపి కార్యకర్తలే శ్రీరామరక్ష**
- **ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి**

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

'నీతోనే నాకు పోటీ మీనాక్షి.. నాకు వైసిపి కార్యకర్తలే శ్రీరామరక్ష' అని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఆదోని ప్రజలు గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించారు. అది చాలు మాకు. నేను కానీ, నా కుటుంబం కానీ ప్రజల స్థలాలు, భూముల విషయంలో కలుగజేసుకుని దోచుకున్నట్లు ఆధారాలతో నిరూపించాలి' అని తెలిపారు. గతంలో మీనాక్షి నాయుడుకు అర్హత లేదని ఎలిగే పాండురంగకు, గుడిసె కృష్ణమ్మకు బీసీ వర్గానికి చెందిన వారికి సీట్లు కేటాయించారని చెప్పారు. మీనాక్షి నాయకుడు వారికి సహకరించకుండా చేసిన పనులు తమకు తెలుసని తెలిపారు. గతంలో సీటు రాలేదని జీపు తగులబెట్టి, ప్రభుత్వ కార్యాలయం తగులబెట్టిన ఘనత మీనాక్షి నాయుడుదేనని చెప్పారు. 'నీ కొడుకు చేసిన అప్పులను అడిగేందుకు వెళ్లిన నంద్యాలకు చెందిన ఓ వ్యక్తి గతంలో మృతదేహమై బయటికి వచ్చాడని గుర్తు చేశారు. భూకబ్జాలు, మట్కా, క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తున్నారని తనపై నిరాధారణమైన ఆరోపణలతో విమర్శించారని, దమ్ముంటే నిరూపించాలని సవాలు విసిరారు. తను నమ్ముకున్న కార్యకర్తల కోసం ఎల్లప్పుడూ కష్టపడి పని చేస్తానని తెలిపారు. ఎంతమంది ఏకమైనా 2024 గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, లక్ష్మికాంత్ రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

వివరాలు వెల్లడిస్తున్న సబ్ కలెక్టర్

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించామని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులు, రాజకీయ పార్టీలు సూచనలు, ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలను పరిగణనలోకి తీసుకొని ఓటర్ల తుది జాబితాను రూపొందించామ ని వివరించారు. ఓటరు జాబితాపై ఏదైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. తహశీల్దార్, ఎఇఆర్ఒ వెంకట లక్ష్మీ, డిప్యూటీ తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, ఎన్నికల ఉప తహశీల్దారు ఎజాజ్ అహ్మద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు 17 రోజుల సమ్మె వేతనాన్ని చెల్లించాలి

- సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు 17 రోజుల సమ్మె వేతనాన్ని జిఒ 17 ద్వారా వెంటనే చెల్లించాలని సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు డివిజన్ నాయకులు వీరేష్, ప్రసాద్, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇస్మాయిల్, నాగరాజు, ప్రతాప్, ఎల్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికులు సమ్మె ద్వారా సాధించుకున్న జిఒ 12, 17ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మునీంద్ర, రాజ్, అహ్మద్, జిలాని, రామాంజిని, వీరేష్, ఖాజావలీ, దేవిపుత్ర, రాజారావు పాల్గొన్నారు.

బదిలీ ఎంపిడిఒకు ఘన సన్మానం

- అందరి సహకారం మరువలేనిది

- ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండలంలో సుదీర్ఘ కాలం పాటు ఎంపిడిఒగా పనిచేసి అనంతపురం జిల్లాకు బదిలీ అయిన ఎంజి.ప్రవీణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. బుధవారం గోనెగండ్లలోని ఎంపిడిఒ సమావేశ భవనంలో ఎంపిపి నసరుద్దీన్, వైసిపి మండల యూత్ అధ్యక్షులు టికె.బందే నవాజ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది ఎంపిడిఒ ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో సుమారు నాలుగున్నర ఏళ్ల పాటు ప్రవీణ్ కుమార్ ఎంపిడిఒగా సేవలను అందించి ప్రజల మనసుల్లో నిలిచిపోయారని తెలిపారు. కరోనా విజృంభించిన సమయంలో కరోనా వ్యాప్తి చెందకుండా నియంత్రించారని చెప్పారు. ప్రజలను కాపాడడంతో పాటు ఈ ప్రాంతం నుంచి వలస వెళ్లిన వారిని సొంత గ్రామాలకు రప్పించడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. సన్మాన గ్రహీత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... మండలంలో పని చేసిన సమయంలో అన్ని వర్గాల నుంచి తనకు సంపూర్ణ సహకారం అందిందని తెలిపారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మీడియా మిత్రుల సహకారంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలను సజావుగా నిర్వహించానని చెప్పారు. అనంతరం ఎంపిడిఒను ఎంపిపి, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. హౌసింగ్ డిఇ ప్రసాద్, ఇఒఆర్‌డి నగేష్, కార్యాలయ ఎఒ బాబు భాస్కర్, ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠ, ఎపిఒ మహ్మద్ బాష, వైస్ ఎంపిపి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎంపిడిఒను సన్మానిస్తున్న ఎంపిపి

పొలం కబ్జాపై ప్రశ్నించినందుకు రాళ్లతో దాడి

- బాధితునికి గాయాలు

గాయాలపాలైన బాధితుడు

ప్రజాశక్తి - హోళగుంద

తన పొలాన్ని ఓ వైసిపి నాయకుడు కబ్జాకు ప్రయత్నిస్తుంటే ప్రశ్నించినందుకు కక్షతో దాడి చేసి గాయపరిచారని బాధితుడు గణేష్ వాపోయారు. బుధవారం హోళగుందకు చెందిన గణేష్ మాట్లాడారు. మండలంలోని ముద్దటమ్మాగి గ్రామంలోని సర్వే నెంబర్ 109ఎఫ్‌లో 4 ఎకరాల భూమిలో తనకు 3 ఎకరాలు, తన అన్న శీనుకు 0.50 సెంట్లు, తన తమ్ముడు పొంపకు 0.50 సెంట్ల భూమి ఉందని తెలిపారు. ఈ భూమి 30 ఏళ్లు గా తామే సాగు చేస్తున్నామని చెప్పారు. తమ పొలానికి ఆనుకుని ఉన్న అదే గ్రామానికి చెందిన (ముద్దటమ్యాగి) కృష్ణారెడ్డికి భూమి ఉందని తెలిపారు. ఆయన తన పొలంలో 50 సెంట్లకు పైగా స్థలాన్ని కబ్జా చేసి, కంది పంటను సాగు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై పలుమార్లు తహశీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. తన పొలంలో అక్రమంగా వేసిన కంది పంటను కొద్దిగా తొలగించి తన స్నేహితులతో ఇంటికి వెళ్తుండగా మార్గంమధ్యలో వైసిపి నాయకుడు గాదిలింగ, అతని అన్న వెంకటేష్‌తో పాటు మరో 8 మంది రాళ్లు, కర్రలతో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. ఈ దాడిలో కన్ను, వీపు, కడుపుపై గాయాలయ్యాయని వాపోయారు. దాడికి పాల్పడిన వైసిపి నాయకునితో పాటు అతని అనుచరులపై కేసు పెట్టాలని పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ పెద్దయ్య నాయుడును వివరణ కోరగా.. ఇరువురూ పోలీసులకు ఫిర్యాదు చేశారని, విచారణ చేపట్టి తప్పు చేసిన వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పార్లమెంటరీ భాషలో విమర్శలు చేసుకోవాలి

- ఆదోని జిల్లా సాధన సమితి అధ్యక్షులు నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఎవరు విమర్శలు చేసినా పార్లమెంటరీ భాషలో చేసుకోవడం మంచి సాంప్రదాయమని ఆదోని జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్ తెలిపారు. బుధవారం అధికార, ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేసుకోవడంపై ఆయన స్పందించారు. ఆదోనికి తాగునీరందించిన చంద్రబాబు నాయుడును ఆదోని ఎమ్మెల్యే అవమానించడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలను ఖండిస్తూ టిడిపి అధినేత చంద్ర బాబు నాయుడును అన్ పార్లమెంటరీ భాషలో విమర్శించడం దారుణమని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న నాయకులు మాట్లాడాల్సిన భాష ఇది కాదన్నారు. ఆదోని పట్టణానికి జలదాత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అవమానిస్తే ఆదోని ప్రజలను అవమానించినట్లేనని తెలిపారు. ఈ విషయంలో మరోపక్క టిడిపి ఆదోని ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు 'నొప్పింపక.. తానొవ్వక' అన్నట్లు రక్షణాత్మక శైలిలో ఆదోని ఎమ్మెల్యేను సుతిమెత్తగా విమర్శించడంలో ఆంతర్యమేమిటో, ఇబ్బంది ఏమిటో ఆయనకే తెలియాలని అన్నారు. మరోపక్క ఆయన తాను సొంతంగా విమర్శించకుండా ఉమ్మీ సలీమ్ చేసిన ఆరోపణలను ఉటంకించటం, ఉమ్మీ సలీం భుజంపై బందూకు పెట్టి కాల్చినట్లుందన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే, వైసిపి ఆదోని నాయకులు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అనేక సార్లు కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని, అప్పుడు స్పందించని మీనాక్షి నాయుడు సరిగ్గా ఎన్నికల ముందు బాబు కోసం బాధపడుతూ స్పందించడంలో మతలబు ఏమిటో ఆదోనిలో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడని అన్నారు. 'కేవలం ఎన్నికల్లో మాత్రమే పోటీ పడదాం. ఎన్నికల తర్వాత కలిసిపోదాం' అని అర్థం వచ్చేలా మీనాక్షి నాయుడు చెప్పడంతో ఇద్దరు నాయకులు ఒకటేనని, 60-40 బంధం నిజమే అనే నిర్ధారణకు ప్రజలు వచ్చారని తెలిపారు. 30 ఏళ్ల నుంచి దగా పడుతున్న ఆదోని నియోజకవర్గంలో ఇకనుంచైనా దాగుడుమూతలు లేని రాజకీయాలతో, పార్లమెంటరీ భాషతో రాజకీయాలు చేయాలని చెప్పారు. ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

10, 11న డిటిఎఫ్ రజతోత్సవ సభలు

- డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 10, 11న విశాఖపట్నంలో ఢాబా గార్డెన్స్‌లోని ప్రేమ సమాజం ఆడిటోరియంలో డిటిఎఫ్ రజతోత్సవ సభలు జరుపుతున్నట్లు డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు కె.కృష్ణ తెలిపారు. బుధవారం ప్రాంతీయ కార్యాలయంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కామన్ స్కూల్ విధానం అమలు కోసం, మాతృ భాష మాధ్యమం కొనసాగింపు, శాస్త్రీయ విద్యా విధానం సాధన కోసం డిటిఎఫ్ ఉద్యమిస్తోందని తెలిపారు. డిటిఎఫ్ జిల్లా, మండల బాధ్యులు ఈశ్వర్ రెడ్డి, వెంకటేశప్ప, రామన్న, శ్రీనాథ్ రెడ్డి, శివశంకర్, చిన్న వీరేష్, సోమేశ్వరరెడ్డి, మల్లికార్జున, వెంకటాచలం, రంగస్వామి, చంద్రశేఖర్ యాదవ్, ఖాజా బాష పాల్గొన్నారు.

ఎంఇఒను సస్పెన్షన్ చేయాలి

- ఆర్‌పిఎస్‌ఎఫ్, ఆర్‌యుఎస్‌ఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

గతంలో జీనియస్ గ్లోబల్ స్కూల్‌కు అనుమతులు ఇచ్చిన ఎంఇఒ వినోద్ కుమార్‌పై చర్యలు తీసుకొని, విధుల నుంచి తొలిగించాలని ఆర్‌పిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది, ఆర్‌యుఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జీనియస్ గ్లోబల్ స్కూల్ ఎదుట ఎంఇఒ వినోద్ కుమార్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీనియస్ గ్లోబల్ స్కూల్ పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఉందని, ఏదైనా ప్రమాదం జరిగితే పెద్దఎత్తున నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. తెలిసి కూడా గతంలో ఎంఇఒ వినోద్ కుమార్ పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ముడుపులు తీసుకొని అనుమతులు ఇచ్చారని చెప్పారు. అలాగే గతంలో టీచర్స్ ట్రైనింగ్ టారోల్ డబ్బులు, జగనన్న విద్యా కానుక రవాణా డబ్బులో దాదాపు రూ.1.50 లక్షల వరకు స్వాహా చేసి అవినీతికి పాల్పడినట్లు డిప్యూటీ డిఇఒ విచారణలో తేలిందని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు స్పందించి ఎంఇఒ వినోద్ కుమార్‌పై చర్యలు తీసుకొని సస్పెన్షన్ చేయాలని కోరారు. లేకపోతే విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. నాయకులు కలాం, నాయుడు, తాహీర్, పవన్, ఉదయ్ పాల్గొన్నారు.

దేవర ఉత్సవాల్లో మురళీ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

దేవర ఉత్సవాల్లో పాల్గొన్న వైసిపి నాయకులు

మండలంలోని చిర్తనకల్లు గ్రామంలో వెలసిన శ్రీమారెమ్మ అవ్వ దేవర ఉత్సవాలకు బుధవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పెద్దమ్మ, దేవమ్మ, మారెమ్మ అవ్వలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ నాయకులు అతిథులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఎంపిపి ఈరన్న, వైసిపి మండల అధ్యక్షులు బెట్టనగౌడ్, జగదీష్ స్వామి, చిర్తనకల్లు, మూగలదొడ్డి, తుమ్మిగనూరు సర్పంచులు పాటిల్ ఈరన్న, సోమేష్, వారం ఈరన్న, సాతనూరు చంద్ర, మఠ్రిస్వామి, భీమేష్, గ్రామ నాయకులు రామిరెడ్డి, విజయభాస్కర్, నర్సప్ప, శివలింగయ్య, రామిరెడ్డి, ఉలిగయ్య, వీరారెడ్డి, రంగస్వామి, తాయప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

టిడిపిలోకి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి..?

- నంద్యాల ఎంపీ టికెట్ ఖరారు..?
- మరో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు - నందికొట్కూరు, పాణ్యంపై గురి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి టిడిపి గూటికి చేరనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బైరెడ్డి సొంత గూటికి చేరేందుకు లైన్ క్లియర్ అయింది. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టు కావడంతో చేరికకు బ్రేక్ పడింది. తండ్రి వెంటే వారసురాలు బైరెడ్డి శబరి కూడా పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం...

మాజీ ఎమ్మెల్యే రాజశేఖర రెడ్డి నందికొట్కూరు సెగ్మెంట్ లో 1994, 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రజా సేవలో తనకంటూ సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు. 2004లో ప్రత్యర్థి గౌరు చరితా రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో నందికొట్కూరు ఎస్సీ రిజర్వుడు అయింది. దీంతో బైరెడ్డి, గౌరు చరితా రెడ్డిలు పాణ్యంలో పోటీ పడ్డారు. కొన్ని అనివార్య కారణాల వల్ల 2012లో టిడిపిని వీడి ప్రత్యేక రాయలసీమ గళం అందుకున్నారు. ఆ సమయంలోనే రాయలసీమ పరిరక్షణ సమితిని స్థాపించారు. రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించి ప్రత్యేక రాయలసీమ కోసం కృషి చేశారు. అందుకోసం ఆయన రాయలసీమ వాసులను చైతన్యం చేసేందుకు రాయలసీమ జిల్లాల్లో పర్యటించారు. కానీ ఆశించిన స్థాయిలో ప్రజాదారణ లేకపోవడంతో 2018లో కాంగ్రెస్ లో చేరారు. అప్పటికే రాష్ట్ర విభజనకు ప్రధాన కారణం కాంగ్రెస్ కావడంతో కాంగ్రెస్ కు కనీసం లీడర్లు కూడా లేకుండా పోయారు. దీంతో ఆయన తిరిగి 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. మిత్ర శత్రువులైన బైరెడ్డి, గౌరు వెంకటరెడ్డిలు పార్టీ కోసం కలిసి పని చేశారు. ఆ తర్వాత తన కుమార్తె డాక్టర్ బైరెడ్డి శబరితో పాటు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. గత కొంత కాలంగా రాయలసీమ వెనుకబాటు తనంపై గళమెత్తుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ తీరును ఎండగడుతూ రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాలు చేపట్టాలని కోరుతూ అనేక ఉద్యమాలు చేశారు. ఏపీ-తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన సిద్దేశ్వరం-సోమశిల ప్రాంతాల వద్ద కేంద్రం ప్రపంచంలోనే రెండోదైన తీగల వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ వంతెనను వ్యతిరేకిస్తూ వంతెనకు బదులు బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మిస్తే సీమ సస్యశ్యామలం అవుతుందని వాదిస్తూ వస్తున్నారు. తద్వారా 70 నుంచి 80 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని సీమ వాసులను చైతన్యం చేస్తూ ప్రభుత్వాలను హెచ్చరించారు. అందుకోసం రాయలసీమ నుంచి ప్రత్యేక ట్రైన్ ద్వారా దాదాపు 3 వేల మందితో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి సక్సెస్ అయ్యారు.

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డికి టీడీపీ అధిష్టానం నంద్యాల ఎంపీ టికెట్ కేటాయించినట్లు సమాచారం. ఎస్సీ నియోజకవర్గమైన నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాలు కూడా తమకే ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే అధిష్టానం అందులో ఒక నియోజక వర్గాన్ని అప్పగించేందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఇటీవల బైరెడ్డి నందికొట్కూరులోని ఆయన నివాసంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమై పార్టీలో చేరికపై చర్చించారు. టిడిపిలో చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో అందరూ సిద్ధంగా ఉండాలని తన అనుచరులకు సూచించారు. ఆయన అనుచరులు కూడా టీడీపీలో చేరితేనే మరింత బలపడతామనే అభిప్రాయాలను చెప్పారు. మొదట ఎమ్మెల్యే టికెట్లు ఆశించినా అధిష్టానం మాత్రం ఆయన జిల్లాను లీడ్ చేయగలరనే ఉద్దేశంతో పార్లమెంట్ స్థానాన్ని అప్పగించింది. ఆయన కూడా ఎంపీగా అయితే 7 నియోజకవర్గాలపై పట్టు సాధించే అవకాశం ఉందని ఎంపీకే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. పాణ్యం టికెట్ టికెట్ అప్పగిస్తే ఆయన కుమార్తె, ప్రస్తుత బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరిని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టే అవకాశం ఉంది. అక్కడ ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి టీడీపీ ఇంచార్జిగా ఉన్నారు. ఆమెకు ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశాలున్నాయని సమాచారం. పాణ్యం కాకుండా నందికొట్కూరు కేటాయిస్తే మాత్రం బైరెడ్డి సూచించిన వారికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వనున్నారు. బైరెడ్డి రాకతో టిడిపి మరింత బలపడుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లెనిన్ ఆశయ సాధనకు కృషి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

సిద్ధాంతవేత్త లెనిన్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని వైష్ణవి కళాశాలలో సిపిఎం ఆధ్వర్యంలో లెనిన్ శతజయంతి సందర్భంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్టంగా అమలు చేయడం ఎలాగో కార్మిక వర్గానికి బోధించి ప్రపంచంలోనే రష్యాలో తొలి సోషలిస్టు విప్లవాన్ని సాధించిన మహా విప్లవ నేత విఐ లెనిన్ అని కొనియాడారు. మార్క్స్ ఎంగెల్స్ సిద్ధాంతానికి ఆచరణకు మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని ఆచరణలో చూపించడం ద్వారా అక్టోబర్ విప్లవం సాధించారని తెలిపారు. లెనిన్ జీవితాంతం కార్మికులు, కష్టజీవులు, రైతాంగ హక్కుల కోసం, దోపిడీ రహిత సమాజం కోసం పాటుపడ్డారని చెప్పారు. నేడు దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికార దాహం కోసం కులాలను, మతాలను, ప్రాంతాలను విభజించి పాలిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాలపై ఐటి, ఈడి, సిబిఐ ద్వారా దాడులు చేయిస్తూ నాయకులను, పార్టీలను లొంగదీసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపిలు నరేంద్ర మోడీని ఎదిరించలేకపోతున్నాయని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయించలేకపోయారని విమర్శించారు. కార్మికులు, కష్టజీవుల రాజ్యాధికారం కోసం కార్మిక, కర్షకులు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, నాయకులు కె.భాస్కర్ రెడ్డి, టి.గోపాలకృష్ణ, పి.పకీర్ సాహెబ్, ఎం.కర్ణ, వి.శ్రీనివాసులు, టి.ఓబులేసు, ఈశ్వరమ్మ, నాగన్న, జయరాని, హుస్సేనమ్మ, బెస్తరాజు, వెంకటేశ్వర్లు, ఏసేపు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్రాస్ కాలువ ద్వారా చెరువులకు నీటి విడుదల

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు మండలంలోని చెరువులకు తాగునీటి అవసరాల కోసం మద్రాస్ కాలువకు బుధవారం 300 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి విడుదల చేయించారు. మండలంలోని చెరువులకు నీరు నింపుకొని, పశువులు నీరు తాగేందుకు, తాగునీటి అవసరాలకు, భూగర్భ జలాల పెంపు కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

- యుటిఎఫ్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు

ప్రజాశక్తి - నంద్యాల

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయాలని కోరుతూ బుధవారం నంద్యాల తాలూకా కార్యాలయం వద్ద యుటిఎఫ్ అధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన పిఆర్సి, క్రమం తప్పకుండా డిఎలు ఇస్తానని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తామని అనేక హామీలు ఇచ్చి నెరవేర్చకపోగా ఈ కాలంలో ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, జీవిత బీమా, సరెండర్ లీవు లాంటి 18 వేల కోట్ల రూపాయలు ఈ ప్రభుత్వం బాకీ పడిందని అన్నారు. గతంలో అనేక పోరాటాలు చేయగా ఆగస్టు 24న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి వర్గ ఉప సంఘం 2023 సెప్టెంబర్‌లోపు పూర్తి బకాయిలు చెలిస్తానని హామీ ఇచ్చారని, కానీ ఆ హామీని నెరవేర్చలేదని చెప్పారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బాకీలను వెంటనే విడుదల చేయాలని ఇప్పటికే ప్రజా ప్రతినిధులకు మెమోరాండంలు అందజేశామన్నారు. రాష్ట్రంలో అన్ని తాలూకా కేంద్రాలు, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ధర్నాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ రాని కారణంగా నేడు యుటిఎఫ్ రెండవ దశ పోరాటంలో భాగంగా జిల్లా కేంద్రంలో 4 రోజులపాటు దీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, ఇలాగే మొండిగా వ్యవహరిస్తే పోరాటాలు భవిష్యత్తులో తీవ్రతరం చేసి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణుడు, అరవిందు, గోపాల్, బాల స్వామి, శేఖర్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రణాళికేతర వ్యయాలకే ప్రాధాన్యత

- రూ. 56.81 కోట్లతో మున్సిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం - రాబడులు తగ్గించి ఖర్చులు పెంచారన్న పలువురు కౌన్సిలర్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రణాళిక వ్యయాల కంటే ప్రణాళికతర వ్యయాలకే మున్సిపల్ బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు కనపడుతుందని, మున్సిపాలిటీకి ఈ బడ్జెట్‌లో ఆదాయ వనరులు వచ్చేలా లెక్క పద్దు లేదని పలువురు కౌన్సిలర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఛైర్ ఫర్సన్ షేక్. మాబున్నిసా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంభందించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ కాపీలను కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి చదివి వినిపించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.47.06 కోట్లు కేటాయించి, సవరించిన బడ్జెట్‌ను రూ.47.50 కోట్లకు ఆమోదం తెలుపగా, 2024-25 ఏడాదికి రూ.56.81 కోట్లకు పెంచినట్లు సమావేశంలో ఆమోదనికి పెట్టగా అధికార, ప్రతి పక్ష సభ్యులు బడ్జెట్‌కు ఆమోద ముద్ర వేశారు. అలాగే ఖర్చులకు సంబందించి ఈ ఏడాది ఖర్చులు కూడా పేరుగోచ్చానే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తూ గత ఏడాది రూ.45.82 కోట్లు ఖర్చుకాగా ఈ ఏడాది రూ.56.41 కోట్లకు సవరించిన బడ్జెట్ రూ.47.24 కోట్లుగా అంచనా వేశారు. ఈ ఏడాది మున్సిపాలిటీకి ప్రాపర్టీస్ పన్నులు ద్వారా, ఖాళీ స్థలాలపైన, అడ్వర్‌టైజ్‌మెంట్ హోర్డింగ్‌ల ద్వారా, సినిమా హాళ్లు, ఇతర వాణిజ్య ప్రకటనలు, సర్ ఛార్జ్ ఆన్ స్టాంప్ డ్యూటీ ఫర్ ట్రాన్సపర్ ఇమ్మూవబుల్ ప్రాపర్టీస్, మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ ఫంక్షన్ హాళ్ల నుండి అద్దెలు, బిల్డింగ్ పర్మిట్ లైసెన్స్ లు, వాటర్ సప్లై చార్జీలు, పన్నులతో పాటు తదితర వాటి నుండి ఆదాయం మున్సిపాలిటీకి వస్తుందని అంచనాల్లో పేర్కొన్నారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, అపకోస్ వర్కర్లకు, ఇతర వేజెస్ జీతాలు, యూనిఫామ్ అలావెన్స్‌లు, రెగ్యులర్ పిహెచ్ వర్క్స్ విద్యుత్ చార్జీలు సచివాలయాలు, మెర్జ్ డ్ గ్రామాలు, కౌన్సిల్ మీటింగ్ ఖర్చులు, మొబైల్ చార్జీలు, లైన్లు, ఇంటర్నెట్ చార్జీలు, ప్రింటింగ తదితర అంశాలకు అగు ఖర్చులు కలిపి మొత్తం ఈ ఏడాది రూ.56.41 కోట్లు ఖర్చులు రావచ్చని అంచనాలతో బడ్జెట్‌కు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆమోద ముద్ర వేసింది. కో ఆప్షన్ సభ్యులు కడగన్ల సుబ్రహ్మణ్యం బడ్జెట్ పై మాట్లాడుతూ బడ్జెట్ చేర్పు కూర్పులు బాగానే ఉన్నాయని, అయితే ప్రణాళిక అవసరలకంటే ప్రణాళికేతర అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు ఉందని, వాటిని తగ్గించుకొని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయలపైన దృష్టి పెట్టాలని సూచించారు.

సమస్యలపై నిలదీత

సాధారణ అజెండాపై జరిగిన చర్చలో అధికార పార్టీకి చెందిన సభ్యులు సమస్యలపైన మున్సిపల్ ఛైర్మన్ మాబున్నిసాను నిలదీశారు. గడప గడప కింద మంజూరైన రూ.20 లక్షలకు సంబంధించిన పనులు వార్డుల్లో జరుగడం లేదని కౌన్సిల్ సభ్యులు ధిక్కార స్వరం వినిపించారు. కొన్ని వార్డుల్లో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పనులు చేస్తున్నారని మిగిలిన వార్డుల్లో పనులు జరుగడం లేదని సభ్యులు నిరసన గళం విప్పారు. ఏకంగా ఎమ్మెల్యే సతీమణి కౌన్సిలర్ నాగిని రెడ్డి తన వార్డులోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైనా నిధులకు ఇంతవరకు టెండర్లు పిలువలేదని పేర్కొనడం విశేషం. ప్రతిపక్ష సభ్యులు మాబు వలి మాట్లాడుతూ తమ వార్డులో అభివృద్ధి జరగడం లేదని ఛైర్మన్‌ను ప్రశ్నిస్తుండగా అధికార పక్షానికి చెందిన కౌన్సిలర్లు మైకులు లాక్కోండి అనడంతో కౌన్సిల్ హాల్లో గందరగోళంగా ఏర్పడింది. అధికార పక్షానికి చెందిన కౌన్సిలర్ దేశం సులోచన మాట్లాడుతూ మున్సిపల్ లో టెండర్లు పిలవకుండా పనులు జరుగుతున్నాయని రూ.25 లక్షల నుండి రూ.30 లక్షలు డ్రావుతుందని ఆడబ్బు ఎక్కడికి వెళుతుందని ప్రశ్నించారు. మున్సిపల్ వర్కర్లకు సరైన నూనె, సబ్బు ఎందుకు ఇవ్వటం లేదని, వారు ఆరోగ్యకరంగా ఉంటేనే కదా మనం పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని, వారు మనుషులు కాదా అని అధికారులను నిలదీశారు. మున్సిపాలిటీలో లక్షలు డ్రా చేస్తుంటే తమరికి తెలియదా అని మున్సిపల్ ఛైర్మన్‌ను దేశం సులోచన ప్రశ్నించారు. సోషల్ మీడియాలో కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు వస్తుందని దానిపైన ఎందుకు సమాధానం చెప్పలేకపోతున్నారన్నారు. వస్తున్న ఆరోపణలపైన శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్లన్లు పాంషావలి, గంగి శెట్టి శ్రీధర్, మున్సిపల్ ఇంజనీరు రమణమూర్తి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, రెవెన్యూ అధికారి కృష్ణ, డిఇ శ్రీనివాస రెడ్డి, మధుకుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రా రెడ్డి

మాట్లాడుతున్న దృశ్యం

ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి తహశీల్దార్

- డిఆర్ఓ పుల్లయ్య

ప్రజాశక్తి - మహానంది : మహానంది తహశీల్దార్ జనార్దన్ శెట్టి మండల ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి అని డిఆర్ఒ పులయ్య కొనియాడారు. తహశీల్దార్ జనార్దన్ శెట్టి ఉద్యోగ విరమణ కార్యక్రమం మహానందిలోని శాలివాహన సత్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్వో పుల్లయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా మహానంది మండలంలో తహసిల్దారుగా విధులు నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎటువంటి అవినీతి మచ్చ లేకుండా, మన్ననలు పొందిన మండల అధికారి జనార్దన్ శెట్టి అని కొనియాడారు. అనంతరం తహసీల్దార్ జనార్దన్ శెట్టిని అధికారులు, నాయకులు, మహానంది విలేకరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షురాలు బుడ్డా రెడ్డి యశస్విని, జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి, ఎంపిడిఓ శివ నాగజ్యోతి, ఎంఈఓ రామసుబ్బయ్య, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి, మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, వైసిపి మండల నాయకులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాణ్యం : ఎపిడబ్ల్యుజెఎఫ్ 2024 డైరీని పాణ్యం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు, డిటి మల్లికార్జున్ రెడ్డిలు బుధవారం ఆవిష్కరించారు. తహశీల్దార్ మాట్లడుతూ నిజాలు నిర్భయంగా తెలియజేసి, ప్రజలను చైతన్యం చేయడంలో మీడియా కీలక పాత్ర పోసిస్తుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య నిత్యం వారధిలా పనిచేస్తూ సమాజ అభివృద్ధికి మీడియా పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్న రామాంజనేయులు, పాణ్యం నియోజకవర్గ కార్యదర్శి నీలం సత్యనారాయణ, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ పాత్రికేయులు రంగస్వామి, ఇప్ప సుధాకర్, నబీ హుస్సేన్, రాముడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ తదితరులు

జిల్లాలో 22 మంది తహశీల్దార్లు బదిలీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లా అధికారుల బదిలీల ప్రక్రియ వేగవంతంగా జరుగుతుంది. మొన్న కమిషనర్‌లు, నిన్న కలెక్టర్లు, నేడు తహశీల్దార్లను బదిలీలు చేస్తూ సిసిఎల్ఏ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా కర్నూలు, నంద్యాలలో దాదాపు 30 మంది తాసిల్దార్లను చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాలకు బదిలీ చేశారు. నంద్యాల జిల్లా నుండి దాదాపు 22 మంది తాసిల్దారులు బదిలీ అయ్యారు. సంజామల మల్లికార్జునరావు, సిరివెళ్ల షేక్ మొహిద్దీన్, రుద్రవరం సుభద్రమ్మ, ప్యాపిలి శివరాముడు, బనగానపల్లె యేసు సుభద్ర, కోయిలకుంట్ల పుష్ప కుమారిలు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే ఉయ్యాలవాడ రవికుమార్, డోన్ బివిఎస్ విద్యాసాగర్, బేతంచర్ల నరేంద్ర నాథ్ రెడ్డి, మిడుతూరు ప్రకాష్ బాబు, బండి ఆత్మకూర్ రవికుమార్, ఆత్మకూరు ఉమాదేవిలు వైయస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు. పగిడాల భారతి, కొత్తపల్లి చంద్రశేఖర్ నాయక్, పాములపాడు రత్న రాధిక, వెలుగోడు మహమ్మద్ రఫీ, గోస్పాడు యానాదిలు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. నంద్యాల తెలుగు గంగ ప్రాజెక్టు యూనిట్ లో పనిచేస్తున్న స్పెషల్ తాసిల్దార్ టి అంజనాదేవి, ఓర్వకల్లు సిహెచ్ శివప్రసాద్ సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. డోన్ ఆర్డిఓ ఆఫీస్ ఏవో శ్రీనివాసులు గౌడ్ తిరుపతికి, అవుకు తహశీల్దార్ శ్రీనివాసులు అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో మూడు సంవత్సరాలుగా పని చేస్తున్న తాసిల్దార్ లందరిని వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వీధి బాలలను గుర్తించి అప్పగించాలి : జడ్జి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

వీధి బాలలను గుర్తించి వారిని వారి కుటుంబాలకు అప్పగించాలని, ప్రభుత్వం అందించే సౌకర్యాలు కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. బుధవార నందికొట్కూరు పట్టణంలోని కోర్టు ఆవరణము నందు స్ట్రీట్ చిల్డ్రన్స్ డే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి బాలలకు ఎవరూ లేకపోతే చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించాలని అధికారులకు ఆదేశించారు. మార్చి 9న (రెండవ శనివారం) నిర్వహించబోవు జాతీయ లోక్ అదాలత్‌లో ఏవైనా సివిల్, క్రిమినల్, ఎక్సైజ్ మున్సిపాలిటీ కేసులు రాజీనా పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు, సిడిపిఒ, టౌన్ ఎస్ఐ హుస్సేన్ బాష, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

డోన్, ప్యాపిలిని కరువు మండలాలుగా ప్రకటించాలి

- డోన్‌లో టిడిపి ఆధ్వర్యంలో రైతుల కరువుకేక
- ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-డోన్

డోన్, ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డోన్ పట్టణంలో టిడిపి ఆధ్వర్యంలో రైతుల కరువు కేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, డోన్ నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ కమతం కాటమయ్య, రాష్ట్ర టిడిపి కార్యదర్శి వలసల రామకృష్ణ మాజీ ఎంపిపి ఆర్ఇ.రాఘవేంద్ర హాజరయ్యారు. డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్, డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. డోన్ టిడిపి కార్యాలయం నుండి ఎద్దుల బండ్లతో ర్యాలీగా పాత బస్టాండ్ మీదుగా వెళ్లి ఆర్‌డిఒకు కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో డోన్ మండలం , ప్యాపిలి మండలాలలో రైతులు వేరుశనగ , ఆముదం, కంది, పత్తి, టమోటా ప్రధాన పంటలు సాగుచేస్తారన్నారు. గత 100ఏళ్ళలో ఎన్నడులేని విధంగా 2023లో ఖరీఫ్‌లో లోటు వర్షపాతం నమోదన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగిరాక అప్పుల ఊబిలో కూరుకపోయారన్నారు. సక్రమంగా సర్వే జరిగి ఉంటే డోన్, ప్యాపిలి మండలాలు కరువు మండలాలుగా ప్రకటించడం జరిగి ఉండేదన్నారు. మీరు ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి డోన్, ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని టిడిపి, జనసేన పార్టీల తరుపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఎన్ హెచ్ 44 డోన్ నుండి ఎన్ హెచ్ 40 సోమయాజులపల్లె వరకు జరుగు ఎన్ హెచ్ 340-బి రోడ్డు పనులకు 2023 మే26న ఆర్థికమంత్రి బుగ్గన శంకుస్థాపన చేశారన్నారు. ఆరోజు నుండి ఈ రోజు వరకు రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా పనులు చేస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణ లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఎప్పుడు ఇస్తారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ టిడిపి సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకష్ణ గౌడ్, డోన్ నియోజకవర్గ టిడిపి తెలుగుయువత అధ్యక్షులు కుమ్మరి సుధాకర్, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్తా మల్లిఖార్జున, రైతు కమిటీ నాయకులు పెద్దపూదేళ్ళ ప్రసాద్ రెడ్డి,రాష్ట్ర ఈడిగ సాధికార కమిటీ నాయకులు ఆర్ఇ.నాగరాజు,డోన్ పట్టణ టిడిపి సమన్వయ కమిటీ ఛైర్మన్ అలా మల్లిఖార్జున రెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు టిఇ.వెంకటనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండ్లలో ర్యాలీగా వస్తున్న టిడిపి నేతలు



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విశ్రాంత విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన విశ్రాంత విఆర్‌ఒ, టిడిపి నాయకులు గాండ్ల ఈశ్వరయ్య(80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు గాండ్ల ఈశ్వరయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గాండ్ల ఈశ్వరయ్య (ఫైల్)

ఆత్మకూరు సిఐగా లక్షినారాయణ బాధ్యతలు

ప్రజాశక్తి - ఆత్మకూరు : ఆత్మకూర్ పట్టణ సిఐగా లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన సిఐకు ఎస్ఐలు కృష్ణమూర్తి, నారాయణ రెడ్డి, సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావును సిఐ మర్యాదపూర్వకంగా కలిశారు.

బండి ఆత్మకూరు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా అనీఫ్ ఖాన్

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఏవో అనీఫ్ ఖాన్ బుధవార బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా పని చేస్తున్న వాసుదేవగుప్త రాబోయే ఎన్నికల సందర్భంగా అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. మంగళవారం ఆయన రిలీవ్ అయి వెళ్లిపోగా ఇన్చార్జి ఎంపీడీవోగా అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పని చేస్తున్న మహమ్మద్ అనీఫ్ ఖాన్ ఇన్చార్జి ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టారు.



ప్రతి కుటుంబానికీ ఉపాధి పని కల్పించాలి : మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో అర్హులైన ప్రతి కుటుంబానికీ ఉపాధి హామీ పని కల్పించాలని ఇన్చార్జి ఎంపిడిఒ అనీఫ్ ఖాన్ తెలిపారు. ఉపాధి హామీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనుల గుర్తింపు, ఆధార్ కార్డ్ సీడింగ్, ఉపాధి హామీ జాబ్ కార్డుల పంపిణీ, బ్యాంకు అకౌంట్లో ఆధార్ కార్డు అనుసంధానం తదితర అంశాలపై సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అప్రమత్తంగా ఉండి ఎలాంటి సమస్యలు లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. హార్టికల్చర్, రెవిన్యూ ప్లాంటేషన్ తదితర పనులను గుర్తించి వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ వసుధ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న యాదవ సంఘం నాయకులు

యాదవ సంఘం నాయకుడు మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె : బనగానపల్లె మండలం చెర్ల కొత్తూరు గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకుడు నక్క రామస్వామి యాదవ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన అఖిలభారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ జి మద్దయ్య యాదవ్, మండల అధ్యక్షులు నట్టల గణ మద్దిలేటి యాదవ్, ప్రధాన కార్యదర్శి రాళ్ల కొత్తూరు శంకర్ యాదవ్, క్రిష్ణగిరి మాజీ సర్పంచ్ పర్లపాటి నాగ శేషుడు యాదవ్, నాయకులు వేములపాడు సుధాకర్ యాదవ్, కటికవానికుంట బాలరాజు యాదవ్, తిమ్మరాజు యాదవ్, కష్ణగిరి రంగస్వామి యాదవ్, శివ కష్ణ యాదవ్‌తోపాటు పలువురు రామస్వామి యాదవ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నక్క రామస్వామి యాదవ్ మృతి యాదవ సంఘానికి తీరని లోటని జి.మద్దయ్య యాదవ్, నట్టల గణ మద్దిలేటి యాదవ్‌లు పేర్కొన్నారు.

వెలుగోడు ఎస్ఐగా భూపాలుడు

ఎస్ఐ భూపాలుడు

ప్రజాశక్తి - వెలుగోడు : వెలుగోడు ఎస్ఐగా బత్తల భూపాలుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వెలుగోడు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకట ప్రసాద్ అన్నమయ్య జిల్లా గాలివీడుకు బదిలీ అయ్యారని చెప్పారు. కర్నూలు జిల్లా దేవనకొండ నుండి తనను వెలుగోడుకి బదిలీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఎస్ఐను పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'జయహో బిసి'ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని అమ్మవారి శాలలోని శ్రీ వాసవి కళ్యాణ మండపంలో నేడు 1న జరిగే జయహో బిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు కోరారు. బుధవారం పట్టణంలోని బిసి సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ముఖ్య అతిధిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో బిసి యాదవ సాధికారక జిల్లా కన్వీనర్ గుర్రప్ప యాదవ్, శ్రీరాములు యాదవ్, వీరభద్రుడు యాదవ్, సుబ్బన్న, బోయ వెంకటేష్, రాముడు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సల్లా నాగరాజు

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

- ఆశాల సమస్యలపై 8న చలో విజయవాడ
- సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆశా కార్యకర్తలు ప్రభుత్వానికి, ప్రజలకు నిత్యం సేవలు అందిస్తున్నారని, ఇచ్చే అతి తక్కువ వేతనాలతో పెరిగిన ధరలకు అనుగుణంగా కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8న జరిగే చలో విజయవాడ కార్యక్రమంలో ఆశాలందరూ పాల్గొని జయప్రద చేయాలని కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చెల్లించే రూ.10 వేల వేతనంలో నెలకు రూ.3 వేలు విధి నిర్వహణ సమయంలో ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. టీఏ, డిఏ చెల్లించడం లేదన్నారు. ఆశాలకు పని భారం ఎక్కువైందని, సమయం, సెలవులు లేవరన్నారు. ఆశా కార్యకర్తలు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. మృతి చెందిన ఆశాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదన్నారు. పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారని చెప్పారు. ఆశాలు గర్భవతులకు ప్రసవ సమయంలో విధి నిర్వహణ చేయాల్సి వస్తుందని తెలిపారు. మెటర్నరీ లీవులు ప్రభుత్వం ఆశాలకు వర్తింపచేయడం లేదన్నారు. ప్రభుత్వం నాసిరకం సెల్‌ఫోన్లు సరఫరా చేయడం ద్వారా పని చేసినా లెక్కలోకి రావడం లేదన్నారు. దేశంలో ఎక్కడా లేని పద్ధతి మన రాష్ట్రంలో రిటైర్మెంట్ చేస్తున్నారని, దీర్ఘకాలంగా సేవలు అందించినా ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడం లేదన్నారు. ప్రతి నెలా గౌరవ వేతనం మొత్తం ఒకేసారి ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఈ నెల 8న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, శారద, లక్ష్మి తదిరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం

తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న రైతు దంపతులు

పాస్ పుస్తకమివ్వకపోతే ఆత్మహత్యే శరణ్యం

- తహశీల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతు దంపతులు నిరసన

ప్రజాశక్తి - బనగానపల్లె

రిజిస్టర్ పొలానికి పాస్ పుస్తకాలు ఇవ్వకుండా అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని యనకండ్ల గ్రామానికి చెందిన రైతు పెద్దన్న, గౌరీ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు పెద్దన్న, గౌరీలు అధికారులు పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అమ్మని పొలాన్ని అమ్మినట్లు ఇతరులకు ఆన్లైన్ ఎక్కించి అధికారులు తమను వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యనకండ్ల గ్రామంలో సర్వే నెంబర్ 359లో తమకు మూడు ఎకరాల పొలం ఉందని, ఆ భూమిని తాము కొనుగోలు చేశామని, అధికారులు పాస్ పుస్తకాలు ఇచ్చి ఆన్లైన్‌లో ఎక్కించమంటే ఎక్కించడం లేదని చెప్పారు. 8 నెలల నుండి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి డాక్యుమెంట్లు ఇచ్చామని, పరిశీలించి బనగానపల్లె తాసిల్దారుకు పంపించినా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. తమ పొలం తమకు ఆన్లైన్లో ఎక్కించకపోతే, పాస్ బుక్ ఇవ్వకపోతే తాము పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పాములపాడు మండలంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పర్యటన

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలంలో రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండలంలోని మద్దూరు గ్రామంలో మాజీ సర్పంచి రాముడు తండ్రి గొల్ల పుల్లయ్య మృతి చెందడంతో ఆయన మృతదేహానికి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కృష్ణానగర్ గ్రామంలో అల్లూరమ్మ మృతి చెందగా ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచి రాముడు కుటుంబాన్ని, ఎంకయ్య కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అనంతరం పాములపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న బుచ్చిరెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మరింత ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి, మద్దూరు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మిట్టకందాల సర్పంచ్ చింతల నారాయణ, నాయకులు జబ్బారు, బాల సుబ్బారెడ్డి, బంగారం భాష, రమణారెడ్డి, మహానంది రెడ్డి, ప్రభాకర్, బాలీశ్వర్ రెడ్డి, బాలు నాయక్, హుస్సేన్, ఎల్ల గౌడ్, వైసిపి యూత్ మండల అధ్యక్షులు బత్తిని చరణ్ కుమార్, వెంకటేశ్వర రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రజల ఆశీస్సులతో బనగానపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం , వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తీరుపాల్ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్యలు ఆవిష్కరించారు. అనంతరం రోడ్డు వెడల్పు కార్యక్రమంలో చేపట్టిన డివైడర్లలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కుమ్మరి సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో కుమ్మర శాలివాహనులకు రాజకీయంలో కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. వైసీపీని మళ్ళీ అఖండ మెజార్టీతో గెలిపించాలని, సిఎంగా జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను మరోమారు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కుమ్మరి సురేష్ బాబు, గ్రామ పంచాయతీ ఈవో ఖలీల్ భాషా, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, వైసిపి నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎస్-ఎస్ఎం సుబ్రహ్మణ్యం, గుండా రవికుమార్, కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శివరాం, దస్తగిరి, జిల్లా అధ్యక్షుడు మద్దయ్య, ప్రధాన కార్యదర్శి బలరాం, నియోజకవర్గం గౌరవ సలహాదారులు బాబయ్య, నాగరాజు, కనకాద్రి పల్లె మాజీ సర్పంచ్ డాక్టర్ దస్తగిరి, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, అవుకు మండలాధ్యక్షులు నాగభూషణం, జ్యోతీశ్వర్లు, రఘు రాముడు, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు మహేష్ బాబు, శివయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

వాహనాలకు పత్రాలన్నీ ఉండాలి

ప్రజాశక్తి - డోన్ : వాహనాలకు అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి.క్రాంతికుమార్ అన్నారు. బుధవారం డోన్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి.క్రాంతి కుమార్, ఏపిఎస్ఆర్‌టిసి డోన్ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్ ఆధ్వర్యంలో డోన్-బేతంచెర్ల రూట్లో ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా తిరుగుతున్న వాహనాలను తనిఖీ చేసి సరైన ఫిట్నెస్, ధ్రువపత్రాలు లేకుండా, అలాగే అధికలోడుతో తిరుగుతున్న ఆటోలను, ఇతర వాహనాలను సీజ్ చేశారు. 14 వాహనాలకు రూ. 51,505 జరిమానా విధించారు. ఇకపై కూడా తనిఖీలు జరుగుతాయని, అక్రమ, సరియైన పత్రాలు లేకుండా అధికలోడుతో వెళ్తున్న వాహనాలను సీజ్ చేసి తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

14 వాహనాలకు జరిమానా విధించిన అధికారులు

విరమణ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఇఒలు కోటయ్య, లక్ష్మి, ఎంఆర్‌సి సిబ్బంది.

విరమణ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని కోటకొండ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఉపాధ్యాయుడు జి.శివ శంకరుడు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల ఎంఈఒలు కోటయ్య, లక్ష్మిలు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడు శివ శంకరుడు మృధు స్వభావి, స్నేహ శీలి, నిగర్వి, 37 సంవత్సరాలు ఉపాధ్యాయ జీవితంలో ఎందరో విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. సర్పంచి వెంకటేష్ మాట్లాడుతూ తమ వూరిలో జరిగిన మొదటి ఉద్యోగ విరమణ కార్యక్రమమని అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు సుబ్బయ్య, హబీబుల్లా, ఉసేనయ్య, యుటిఎఫ్ నాయకులు ప్రసాద్, రామకృష్ణారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు సుబ్బయ్య, శ్రీనివాసులు, సావిత్రి, నాగలక్ష్మి, ఉమాదేవి, మండలంలోని వివిధ పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడుతూరు ఎంపిడిఒ బదిలీ

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరు ఎంపిడిఒ జీవన్ రెడ్డి ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. బుధవారం స్థానిక విలేకరులతో ఎంపిడిఒ మాట్లాడుతూ గడిచిన ఈ ఐదు సంవత్సరాలలో మండల ప్రజా పరిషత్తు అధికారిగా విధులు నిర్వహించడంలో తనకు తోడ్పాటు అందించిన జెడ్పీటీసీ, మండల అధికారులు, సర్పంచులు, మండల పరిషత్ ప్రతినిధులు, గ్రామ, మండల, నియోజక వర్గ స్థాయి నాయకులకు, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి : ఎంపిపి

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ సరోజినీ వర్జినియా కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. అధికారులు గత మూడు నెలల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. గ్రామాలలోని సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిష్కరించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి పని చేయాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో కర్ణ సాగర్, ఈఓఆర్డి శ్రీనివాస్ నాయుడు, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి వర్జినియా

చౌకబారు వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

- రాజకీయాలపై మక్కువతో వచ్చాను : ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాజకీయాలపై మక్కువతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి తాను వచ్చానని, నాడు ఆస్తులు అమ్ముకొని ఖర్చు పెడుతూ రాజకీయాలు చేస్తున్నామని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తనపై తన కుటుంబంలోని సభ్యులపై ఓ పత్రికలో తప్పుడు కథనాలు వచ్చాయని, వారి దగ్గర ఆధారాలు ఉంటే నిరూపించాలన్నారు.. తాను అక్రమంగా 200 ఎకరాలు ఆర్జించానని, వాటి ఆధారాలు చూపిస్తే వాళ్లకే ఇచ్చివేస్తానన్నారు. హైదరాబాదులో తాను 1990లో పుట్టే సమయానికే ఇండ్లు, ఫామ్ హౌస్ ఉండేదన్నారు. 2012లో తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని, ఉన్న ఆస్తులు అమ్ముకొని ఖర్చుపెట్టి రాజకీయం చేశానన్నారు. తాను కొన్నవి, అమ్మినవి అన్ని ఆధారాలతో చూపిస్తానని, వారు చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. 2007లో బళ్లారిలో వ్యాపారం, 2010లో నంద్యాల హౌసింగ్ కాంట్రాక్టర్‌గా చేశానని, 2012లో ఉన్న ఆస్తులను అమ్ము కున్నానన్నారు. తాను రాజకీయాల్లోకి రావాలను కుంటున్నానని తన తండ్రి గంగుల ప్రభాకర్ రెడ్డితో చెప్పినప్పుడు నైతికతతో రాజకీయాలు చేయాలని ఆయన సూచించారని, ఆ మార్గంలోనే నడుస్తున్నానన్నారు. మా తాత గంగుల తిమ్మారెడ్డి నుంచి తన వరకు నా కుటుంబంలో ఎక్కడ తప్పు చేయలేదన్నారు. మా తల్లి గురించి అవాస్తవాలు రాశారని, వారిపై పరువు నష్టం దావా వేస్తున్నానన్నారు. రాజకీయంగా ఎంతైనా విమర్శలు చేయొచ్చు కానీ వ్యక్తిత్వంపై విమర్శలు చేయడం సబబు కాదన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో బీసీల భూములు లాక్కున్న రోజున నీవు మీ పత్రికలో ఎందుకు కథనాలు రాయలేకపోయావని ప్రశ్నించారు. ఇప్పుడైనా ఆధారాలు చూపిస్తానని, రాసే దమ్ముందా అని ప్రశ్నించారు. మళ్లీ అసత్య కథనాలు రాస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో నలుగురు వ్యక్తులు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నారని, మూడు సంఘటనలు జరిగాయని, తన దృష్టికి వచ్చిన వెంటనే నిజా నిజాలు విచారించి రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయించామన్నారు. వాటి గురించి ఆధారాలు ఇస్తానని, మీ పత్రికలో ప్రచురిస్తారా అని ప్రశ్నించారు. చౌకబారు వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమన్నారు. ఉయ్యాలవాడ మండలం కొండుపల్లిలో నలుగురు రైతుల పంటలను కాల్చివేసిన ఘటనపై ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామని, రెండు రోజుల్లో ఈ ఘటనకు కారకులైన వారిని ఎంతటి వారినైనా పోలీసులు శిక్షిస్తారని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నలుగురు రైతులకు న్యాయం చేయాలని సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, మాదం చెన్నయ్యలు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

సమస్యల పరిష్కారానికి కృషి : అర్జున్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని ఆయా కాలనీలలో తాగునీరు, డ్రైనేజీ, సిసి రోడ్లు, వీధిలైట్లు తదితర సమస్యలు ఏమైనా ఉంటే తమ దష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారం చూపుతామని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని సంజీవ నగర్‌లో ఆయన ఇంటింటికి తిరిగి సమస్యలు ఏమన్నా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తక్షణ పరిష్కారం కొరకు గోరుకల్లు రిజర్వాయర్ నుండి రూ. 361 కోట్లతో శుద్ధ జల నీటిని త్వరలో సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చలం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ కాజా హుస్సేన్, వైసిపి నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి, చందు రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, గొర్లగుట్ట మాజీ సర్పంచ్ సుధాకరప్ప, సచివాలయం కన్వీనర్ సాయి కిరణ్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, నాయకులు గోపాల్ రెడ్డి, టౌన్ ఉపాధ్యక్షులు కటారి కొండ మద్దిలేటి, నిరంజన్, సాలబోయిన నాగరాజు, టైలర్ ఆనంద్, వల్లంపాడు మధు, వంజా వెంకట రాముడు, యాదరాళ్ల మద్దిలేటి, యాదరాళ్ల శీను, రంగనాయకులు, హరి, కుమార్, షాషా, బోగోలి రమేష్, ఎర్రగుంట రమేష్, చింతపండు వలి, తలారి మధుకృష్ణ, రవి, సురేష్, కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అర్జున్ రెడ్డి

అవినీతికి కేరాఫ్‌గా సోషల్ వెల్ఫేర్ డిడి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల

అవినీతికి అడ్డాగా నంద్యాల సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి నిలిచారని, వెంటనే అమెను విధుల నుండి పూర్తిగా తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డక్క కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిడికు ప్రతి వార్డెన్ 2 వేలు, విద్యార్థులకు వచ్చే బెనిఫిట్స్‌లో 60 శాతం ఇవ్వాల్సిందేనని, ఇవ్వకపోతే వార్డెన్లను బెదిరించడం ఆమె నైజమన్నారు. మహిళా వార్డెన్లు, నిజాయితీగా పని చేస్తున్న వార్డెన్లు తీవ్ర భయాందోళనకు గురవుతన్నారన్నారు. ఒత్తిడి తట్టుకోలేక పోతున్నారని, ఇవ్వని వార్డెన్లపై అధికార జులుం చూపుతున్నారని చెప్పారు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న డిడిని టర్మినేట్ చేయాలని, సోషల్ వెల్ఫేర్ విద్యార్థులందరూ కూడా కోరుతున్నారని చెప్పారు. నేరుగా వార్డెన్‌లే కలెక్టర్‌కు డిడిపై ఫిర్యాదు చేసిన సందర్భం జరిగి నాలుగైదు రోజులు గడుస్తున్నా జిల్లా కలెక్టర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. డిడి చింతామణి ద్వారా లక్షలకు లక్షలు డబ్బులు పోగొట్టుకొని మానసికంగా ఇబ్బందులు పడుతూ, బాధింపబడ్డ బాధిత వార్డెన్లకు కాపాడుకోవాలని, అలాగే ఆమె గూఢచారులు వార్డెన్ ఉమాదేవిని, కోటిరెడ్డిని సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలోఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని పోతుదొడ్డి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. అనంతపురంకి చెందిన చాంద్ బాషా(52) హైదరాబాదు నుంచి అనంతపురంకు ఇనుప కడ్డీల లోడు లారీతో వెళ్తుండగా పోదొడ్డి వద్ద డివైడర్ను ఢీకొనడంతో లారీ బోల్తా పడింది. ఇనుప కడ్డీలు అయనపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మామూదా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒరిజినల్ పొలం డాకుమెంట్స్ పోయినవి

ఆళ్ళగడ్డ RTC బస్టాండ్ లో డాక్యుమెంట్ నెంబర్ 1867/2011. తేది 04-10-2023 ఆళ్ళగడ్డ టౌన్ కు సబంధించిన సర్వే నెంబర్.289/2A పాత 289/2A3 కొత్త-0.25.1/2 సెంట్లు గల దస్తావేజులు పోయినవి.

దొరికిన వారు కింది అడ్రస్ కు ఫోన్ చేసి తెలుపగలరు.
సిద్ధం రెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి అక్కి రెడ్డి
చింతకుంట గ్రామం, ఆళ్ళగడ్డ మండలము నంద్యాల జిల్లా.
సెల్ : 7287070809

శాంతినికేతన్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ, ఐసా, ఎన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శాంతినికేతన్ విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కుమార్, ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జునలు డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మంకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని శాంతినికేతన్ విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అధిక మొత్తంలో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తుందని ఆరోపించారు. అలాగే సంజీవనగర్‌లోని బ్రాంచ్‌కు ఫైర్ సర్టిఫికేట్, గ్రౌండ్ ఫెసిలిటీ లేకున్నా వున్నాయని విద్యాశాఖ అధికారులకు దొంగ పత్రాలు చూపించి అధికారుల కళ్ళు కప్పుతున్నారని అన్నారు. స్కూల్ ముందు ట్రాన్స్ఫార్మర్ పెట్టి విద్యార్థుల ప్రాణాలకు ఏ విధంగా రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. వెంటనే శాంతినికేతన్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కూల్‌లో అర్హత లేని వారితో విద్యార్థులకు బోధన చేయిస్తున్నారని, ఫీజు నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి తక్షణమే శాంతినికేతన్ విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన మండల విద్యా శాఖ అధికారి బ్రహ్మం మాట్లాడుతూ స్కూల్‌కు నోటీసులు పంపిస్తామని, తక్షణమే విచారణను ప్రారంభిస్తామని హామీనిచ్చారు.

ఎంఇఒకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

మహారాజశ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు
O.S.No: 409 / 2023.

జి.రాఘవేంద్ర. ...వాది
-Vs-
పి.మద్దిలేటి స్వామి. ...ప్రతివాది
టు,

ప్రతివాదికి సమన్సు

(సాలె) పలువరి మద్దిలేటి స్వామి: వయసు : 33 సం॥, తండ్రి: మద్దయ్య: హిందూ: వ్యాపారము: గార్లదిన్నె గ్రామము & పోస్టు : వయా జలదుర్గం (పి.హెచ్.ఒ), ప్యాపిలి మండలం: నంద్యాల జిల్లా: పిన్- 518 220.

వాది అనువారు ప్రాంసరినోటు బాకీ వసూలు నిమిత్తము మీ మీద వాజ్యం తెచ్చినందువలన సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగలందులకు 27.02.2024 తేదిన పగలు 10:30 గంటలకు స్వతహాగా పై కోర్టులో హాజరయేటట్లు యిందువలన మీకు ఆజ్ఞాపించడమైనది. పై చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమందు ఈ వాజ్యమును విమర్శచేసి తీర్మానించడమవునని తెలుసుకోవలసినది.

(కోర్టువారి ఉత్తర్వు మేరకు)

ఇట్లు
కోట్ల హరిశ్చంద్రారెడ్డి,
అడ్వకేటు, డోన్,
నంద్యాల జిల్లా.
సెల్ : 94405 88904

టిడిపి పాలనలోనే బిసిల అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూరు

తెలుగుదేశం పార్టీ పాలనలోనే బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందారని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం అమలాపురం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాపురం గ్రామస్తులు బుడ్డా రాజశేఖర్ రెడ్డిని గజమాలతో సన్మానించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ టిడిపి మొదటి నుండి బీసీ సామాజిక వర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి అనేక అవకాశాలు కల్పించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ల పేరుతో వారి అభివృద్ధికి తీరని అన్యాయం చేస్తుందన్నారు. రాబోవు ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కోఆర్డినేటర్ తిరుపాల్ బాబు, కురువ సాధికారత సభ్యుడు శివప్రసాద్, అమలాపురం బీసీ నాయకుడు గోకారి, వెంకటాపురం గ్రామ సర్పంచ్ గంగా భవాని దేవి, దగ్గుపాటి శ్రీనివాసులు, నాగార్జున యాదవ్, మురళి, రమేష్ గౌడ్, మండల అధ్యక్ష కార్యదర్శులు శివప్రసాద్ రెడ్డి, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి